క్లుప్తంగా

కొత్త బస్సులు ప్రారంభం

మదనపల్లె సిటీ: మదనపల్లె వన్, టుడిపోలకు చెందిన కొత్త బస్సులు సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డిపోలకు 25 కొత్త బస్సులు రానున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. మదనపల్లె-1 డిపో నుంచి బళ్లారి,హైదరాబాద్, తిరుపతి, టుడిపో నుంచి విజయవాడ, తిరుపతిలకు కొత్త బస్సులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, అమరనాథ్, ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓ సమావేశం వాయిదా

బి.కొత్తకోట: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశాన్ని ఏపీఎం రాజేశ్వరీ వాయిదా వేశారు. సంఘ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయించారు. అయితే నలుగురైదుగురు మినహా మిగిలిన వాళ్లు హాజరుకాలేదు. దీనితో వాయిదా వేస్తు నిర్ణయం తీసుకున్నారు.

బదిలీపై వెళ్లిన డీటీకి సన్మానం

పీలేరురూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీటీగా పని చేస్తూ జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయిన రెడ్డెప్పరెడ్డికి ఘన సన్మానం లభించింది. సోమవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో దుశ్శాలువలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెడ్డెప్పరెడ్డి మండలంలో విశేష సేవలందించి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. డీటీ సుబ్రమణ్యం, ఏఎస్‌వో రామ్మోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ అభివృద్ధికి కృషి

కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండ అభివృద్ధికి కృషి చేస్తానని నియోజక వర్గ టీడీపీ నాయకుడు డి. జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన కొండపై స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ కొండను అన్ని విధాలా అభివృద్ధి చేయడం, నూతన ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే కొండపై అమర్చాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఆలయ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తితో పాటు సీడ్ మల్లికార్జున నాయుడు, వైజీ సురేంద్ర, జంగా రాఘవరెడ్డి, తెట్టు రెడ్డి శేఖర్, రాజారెడ్డి, శ్రీనివాసులు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

రామసముద్రం : ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అభివృద్ధి పనులను చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. అలాగే రెవెన్యూ సమస్యలు మండలంలో అధికమవుతున్నాయని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి తమ దృష్టికి వస్తున్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి



వెంకటరమణారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె : భారతీయ జనతాపార్టీ మదనపల్లె అసెంబ్లీ రూరల్-1 మండల అధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ...మండలంలో బీజేపీ బలోపేతానికి నూతన అధ్యక్షుడు వెంకటరమణ కృషి చేస్తారన్నారు. కేంద్ర, కూటమిప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వసంత్‌కుమార్, భగవాన్, పిల్లస్వామినాయక్, భువనేశ్వరిసత్య, నారదరెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక సిద్ధం చేయండి

కలకడ : వేసవిలో గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్ విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం మండలంలోని బాలయ్యగారిపల్లె సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంచాయతీలోని అన్ని గ్రామాలలో పర్యటించి ప్రభుత్వ స్కీం బోర్‌లలో నీరు ఉన్నయా, నీటి కొరత ఉందా అనే నివేదికను సిద్ధం చేయాలన్నారు. అనంతరం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, ఇతర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా



మదనపల్లె ఐసీడీయస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



బి.కొత్తకోటలో వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

మదనపల్లె : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచడంతో పాటు గ్రాట్యుటీ అమలుచేస్తూ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ ఇవ్వాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ఐసీడీయస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సీడీపీఓ సుజాతకు డిమాండ్లతో కూడిన నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు డి.ఆర్.మధురవాణి, ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరిలు మాట్లాడుతూ...పేదగర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు సేవలందిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఐదేళ్లుగా అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. గతంలో వేతనాల పెంపుపై 42రోజులు సమ్మె నిర్వహించిన నేపథ్యంలో, ముగింపు సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని మినిట్స్ ఇచ్చినప్పటికీ, నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అంగన్‌వాడీలకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి, సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలుచేయాలన్నారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహనసంస్కార ఖర్చులకు రూ.20వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. మెనూ ఛార్జీలు పెంచడంతో పాటు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవు కనీసం 3 నెలలు ఇవ్వాలన్నారు. ఐదేళ్ల పిల్లలందరూ అంగన్‌వాడీ సెంటర్లో ఉండేలా జీఓ ఇవ్వాలన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) నాయకురాలు గౌరి, కరుణశ్రీ, సులోచనలు డిమాండ్ చేశారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంచి, గ్రాట్యూటీ పెంచాలన్నారు. పెండింగ్ అద్దెలు, టీఏ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ ఓబుల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో స్వరూపరాణి, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కొత్తకోట ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బందికి వేతనం రూ.26వేలకు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మిని కేంద్రాలను అంగన్‌వాడీ ప్రధాన కేంద్రాలుగా మార్చాలని కోరుతూ నినాదాలు చేశారు. తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, తక్షణమే టీఏ, అద్దెలు చెల్లించి, సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రాలకు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వారు వినతిపత్రం అందించారు.

కమ్యూనిటీ పర్పస్ స్థలాలు
కబ్జా కాకుండా చర్యలు తీసుకోండి

– కలెక్టర్‌కు బీవైఎస్ పునీత్ వినతి



కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ అధ్యక్షులు పునీత్

మదనపల్లె : పేదల కోసం కేటాయించిన ఇందిరమ్మ, జగనన్న లేఅవుట్లలో ప్రజాప్రయోజనాలు(కమ్యూనిటీ పర్పస్) కోసం వదిలిపెట్టిన ఖాళీస్థలాలను కబ్జాదారులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరికి బహుజన్ యువసేన అధ్యక్షులు పునీత్ ఫిర్యాదుచేశారు. సోమవారం రాయచోటిలో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ...మదనపల్లె మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పేదల కోసం వేసిన అనేక లేఔట్లలో కమ్యూనిటీ పర్పస్ కోసం వదిలిన స్థలాలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. లేఅవుట్లలో బడి, పార్కు, హాస్పిటల్, ఇతర ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగపడాల్సిన స్థలాలు... కబ్జాదారుల చేతుల్లో పడి లక్షల రూపాయలకు విక్రయాలు జరిగిపోతున్నాయన్నారు. వీటిపై రెవెన్యూ, హౌసింగ్ అధికారులకు ఫిర్యాదుచేసినా ఎలాంటి చలనం ఉండటం లేదన్నారు. బీకే.పల్లె సర్వేనెంబర్.539లో కమ్యూనిటీ పర్పస్ కోసం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు జరుగుతుండగా, స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సబ్ కలెక్టర్ ఈ విషయమై అన్ని లేఅవుట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూస్తాయన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు శ్రీనివాసులు, శశికుమార్, శివ, హరికుమార్, భానుప్రకాష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో బీసీ కార్పొరేషన్ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం 10గంటలకు గుర్రంకొండ, నడిమకండ్రిగ, ఎల్లుట్ల, సరిమడుగు, పసలవాండ్లపల్లె, సంగసముద్రం, కండ్రిగ, చెర్లోపల్లె గ్రామాలకు సంబంధించిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వీరంతా గుర్రంకొండలోని యూనియన్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణబ్యాంకు పరిధిలోకి వస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని శెట్టివారిపల్లె, తరిగొండ, అమిలేపల్లె, మర్రిమాకులపల్లె, రామాపురం, టి. రాచపల్లె, మర్రిపాడు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వీరంతా తరిగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు, వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణబ్యాంకుల పరిధిలోకి వస్తారన్నారు. దరఖాస్తు దారులు ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

రేపు కలకడలో..

కలకడ : మండలంలోని బీసీ, కాపు, ఈబ్ల్యూఎస్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీమ్ కోరారు. బ్యాంకు ప్రతి నిధులు కూడా హాజరవుతారని తెలిపారు. వ్యక్తిగత రాయితీ రుణాలు యువత అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడుతాయని గుర్తు చేశారు. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు విధిగా హాజరు కావాలన్నారు.

19న బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: రుణాల కోసం చేసుకున్న నిరుద్యోగులు ఈనెల 19న నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కమిషనర్ జీవీ.పల్లవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కాపు, బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

65 యూనిట్లకు 321 దరఖాస్తులు

పెద్దతిప్పసముద్రం: మండలానికి బీసీ, క్రిస్టియన్, మైనారిటీలకు సంబంధించి మొత్తం 65 రాయితీ కార్పొరేషన్ యూనిట్లు మంజూరు కాగా 321 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకర్లతో సంప్రదించి వారి సూచనల మేరకు త్వరలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని సోమవారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాఘమాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

షూటింగ్‌బాల్ విజేతకు సన్మానం



యూసఫ్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం మదన్‌మోహన్

తంబళ్లపల్లె: ఏషియన్ షూటింగ్‌బాల్ పోటీల్లో క్రీడాకారుడు యూసఫ్‌బాషాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని హెచ్‌ఎం మదన్‌మోహన్ తెలిపారు. సోమవారం కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో షూటింగ్‌బాల్ విజేత యూసఫ్ బాషాను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతం నుంచి అంచెంచెలుగా ఆటల పోటీల్లో రాణిస్తూ ప్రతిభ చాటి రెండవ ఏషియన్ షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్-25 లో గోల్డ్‌మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పీలేరు : పట్టణంలో ఆర్‌వోబీ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజా రోగ్యాన్ని కాపాడాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీలేరు పట్టణంలో ఆర్‌వోబీ నిర్మాణ పనులు నత్తనడకన చేస్తుండడంతో దుమ్ము దూళితో పట్టణం నిండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా దుమ్ముతో వాహనదారులు, ప్రయాణికులు, షాపు యజమానులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆస్మా, శ్వాసకోశ వ్యాధుల భారిన పడుతున్నారని చెప్పారు. మరోవైపు దుమ్ముతో వ్యాపారాలు కూడా జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పలుమార్లు అధికారులకు, కాంట్రాక్టర్లకు విన్నవించినా ఎవరూ స్పందించలేదన్నారు. ఆర్‌వోబీ పనులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో కనీసం రెండు ఇంచీల తారు రోడ్డు అయినా వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టి.ఎల్. వెంకటేష్, డి. వెంకటరామయ్య, దుబ్బా శ్రీకాంత్‌బాబు, నారాయణబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడానికి నిర్ణయించాయని, ప్రతి రైతు పొందాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు డిజిటల్ గుర్తింపు కార్డు పొందడానికి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మండలంలోని రైతుల సేవా కేంద్రాల్లో ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరుతో నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందడానికి డిజిటల్ గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, ఏవో రమాదేవి, ఏఈవో నజీర్, ఏఎస్‌వో రామ్మోహన్ పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటాం

– ఎమ్మెల్యే షాజహాన్ బాషా

నిమ్మనపల్లె : ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. సోమవారం నిమ్మనపల్లిలోని పెద్ద మాదిగపల్లె వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రెడ్డి నారాయణ, ఇతర దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎం.ఎస్.పి రాష్ట్ర నాయకులు నరేంద్ర తో కలసి ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిమ్మనపల్లెలో అంబేద్కర్ భవనం, టీటీడీ కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేయాలని, స్థానిక బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహాన్ని ఆధునికరించాలని ఎమ్మెల్యే దృష్టికి నాయకులు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అంబేద్కర్ భవనానికి స్థలాన్ని తక్షణం ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ విగ్రహాన్ని మండల పరిషత్ నిధులతో సుందరీకరణ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో వరమేశ్వర్ రెడ్డి ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డి ప్రసాద్, శ్రీనివాసులు, రాజశేఖర్, వెంకటరమణ, జయన్న, రాజన్న, సర్పంచులు సుబ్రహ్మణ్యం, పాపులమ్మ,శ్రీవాణి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో క్రీడలు కీలకం



జాతీయ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కురబలకోట: దేశ నిర్మాణం, సామాజిక, వ్యక్తిగత అభివృద్ధికి క్రీడలు ఎంతో కీలకమని ఇండియన్ షూటింగ్ బాల్ ప్లేయర్ షేక్ మహమ్మద్ యూసఫ్ బాషా అన్నారు. అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అశ్వ-2కె25 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో సోమవారం ఆటల పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేశాన్ని ఏకం చేయడంలో, ఆరోగ్య, సామాజిక నైపుణ్యాలను పెంచడంలో తోడ్పడతాయన్నారు. ఒబకాయాన్ని తగ్గిస్తాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, ఫిజికల్ డైరెక్టర్ దామోదరన్ పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించండి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతి



పీజీఆర్‌ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు వినతిచేస్తున్న భవననిర్మాణ కార్మికులు

మదనపల్లె : మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని భవన నిర్మాణ కార్మికులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు అర్జీ సమర్పించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు సమస్యలు వెల్లువెత్తాయి. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు అర్జీలు అందజేశారు. ప్రజాసమస్యలను తెలుసుకున్న సబ్ కలెక్టర్ వాటి పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మదనపల్లె పట్టణంలో ఐదువేలమందికి పైగా భవననిర్మాణ కార్మికులు ఉన్నారని, వీరికి సంబంధించి అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నామని, అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. మార్కెట్‌ధరకు మంజూరుచేస్తే ప్రభుత్వ స్థలం కొనుగోలుకు తమకు అభ్యంతరం లేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జంగాలశ్రీనివాసులు, సెక్రటరీలు మోదీన్‌బాషా, రెడ్డిసాహెబ్, రామాంజులు పాల్గొన్నారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ తోటవారిపల్లె ఆముదాలకాల్వ గ్రామానికి తాగునీరు, రోడ్డుసౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఫిర్యాదుచేశారు.

హెచ్‌ఎం, పీటీలను సస్పెండ్ చేయాలని నిరసన

మదనపల్లె సిటీ: కులంపేరుతో తిడుతూ, తీవ్ర అసభ్య పదజాలం ఉపయోగిస్తూ తమను చదువుకు దూరం చేస్తున్న మదనపల్లె మున్సిపల్ హోప్ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ విజయకుమారి, పీఈటీలను సస్పెండ్ చేయాలని సోమవారం ఆ పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే ఇంటి ముందు నిరసనకు దిగారు. విద్యార్థులు మాట్లాడుతూ తమను కులం పేరుతో తిట్టడమే కాకుండా తీవ్ర అసభ్య పదజాలంతో మాట్లాడడం జరుగుతుందన్నారు. ఆదివారం సెలవు రోజు అయినందున ప్రత్యేక తరగతులకు హాజరుకాకపోవడంతో సోమవారం జరగాల్సిన ప్రీఫైనల్ పరీక్షలకు అనుమతించకుండా తమను పాఠశాల నుంచి బయటకు పంపివేశామన్నారు. గతంలో కూడా వారు తమను తీవ్రంగా దూషించేవారన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ దీనిపై విచారణ చేయాలని డీవైఈఓను ఆదేశించారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి విచారణ చేశారు. ఈ విషయంపై హెచ్‌ఎం విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థులను అసభ్యకరంగా మాట్లాడటం లేదన్నారు. విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా హాజరుకాకపోవడంతో తల్లిదండ్రులకు పిలుచుకొని రావాలని చెప్పామన్నారు. దీంతో విద్యార్థులు తనపై లేనిపోని ఆరోపణలు చేశారన్నారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘటనపై హెచ్‌ఎం విజయకుమారికి మదనపల్లె డివైఈఓ కె.వి.వి.కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

భూమిని కాపాడటం మనందరి బాధ్యత

- రోజురోజుకీ పెరిగిపోతున్న కాలుష్యం
- పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్న వైనం
- సేవ్ ఎర్త్- నో వార్ ర్యాలీలో ఎమ్మెల్యే



సేవ్ ఎర్త్- నో వార్ అవగాహన ర్యాలీ

మదనపల్లె : 'భూమిని కాపాడటం మనందరి బాధ్యత. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా ఆధారం భూమి మాత్రమే. గాలి, నీరు, అగ్ని, నేల, ఆకాశం అనే పంచభూతాల వల్లే మానవజాతి మనుగడ సాధ్యమవుతుంది. భూమి సారవంతంగా, సస్యశ్యామలంగా ఉంటేనే మానవ అభివృద్ధి నిజమవుతుందని' ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం సేవ్ ఎర్త్- నో వార్ పేరుతో పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో సమావేశం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ...భూమి ఉపరితలం మీద ఉన్న వనరులే కాకుండా అట్టడుగున దాగి ఉన్న భూగర్భజలాలు, ఖనిజవనరులను విచక్షణారహితంగా వాడటం వల్ల భూతాపం పెరగడంతో పాటు కొంతకాలానికి ముడిచమురు నిల్వలు అంతరించిపోతాయని పరిశోధకుల హెచ్చరిస్తున్నారన్నారు. రోజురోజుకు పచ్చని చెట్లు తగ్గిపోవడం, కొన్ని జీవరాశులు నశించిపోవడం కారణంగా భూతాపం పెరుగుతూ వస్తోందన్నారు. భూతాపం పెరగడం వల్ల పర్యావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. పర్యావరణాన్ని, ప్రపంచశాంతిని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, డాక్టర్.ఎస్.సేతు, పోర్డ్ లలితమ్మ, కామకోటిప్రసాదరావు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బి.కొత్తకోట: రక్తదానం ప్రాణ దానంతో సమానమని మదనపల్లె హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్దిక్ అన్నారు. సోమవారం స్థానిక మధుమీనాక్షి కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరం సందర్భంగా విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎప్పుడు ఏ క్షణంలో బాధితులకు రక్తం కావాల్సి వచ్చినా అందుబాటులో ఉంటామని అన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానంతో ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం నిల్వలు తగ్గకుండా శిబిరాల ద్వారా రక్తం నిత్యం అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్నామని చెప్పారు. శిబిరంలో 33 మంది విద్యార్థులు రక్తాన్ని దానం చేశారు. వంద మంది విద్యార్థులు ఉచితంగా బ్లడ్‌గ్రూప్ పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఫయాజ్, ఆరీఫ్, శీను, విష్ణు, ఇంతియాజ్, శ్రీదేవి, ఉస్మాన్, టెక్నీషియన్ బాలచంద్ర బాయుడు, కృష్ణ పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని మార్చండి

మదనపల్లె సిటీ: క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు కేటాయించిన సమయాన్ని మార్చాలని వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల ఉపాధ్యాయులకు అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు బస్సు సౌకర్య లేనంటువంటి ప్రాంతాల్లోనూ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, అలాగే దివ్యాంగ ఉపాధ్యాయులకు ఇది ప్రమాదకరమన్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 5 గంటలకు బయలుదేరిన వారికి ఫోన చార్జింగ్ లేక అటెండెన్స్ ఇబ్బందులు ఎదురై అవకాశం ఉందన్నారు. పాఠశాల సమయం నాలుగు గంటలకు ముగించాల్సి ఉండగా కాంప్లెక్స్ సమావేశాల పేరుతో ఐదున్నర గంటల వరకు పెంచడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నాలుగు గంటలకే ముగిసే గంటలకే ముగిసే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

తండేల్ విజయోత్సవ సంబరాలు



కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న నాగచైతన్య ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై నాగచైతన్య, సాయిపల్లవి హీరోహీరోయిన్లుగా నటించిన తండేల్ సినిమా రూ.100 కోట్ల కలెక్షన్‌కు సాధించిన సందర్భంగా హీరో అభిమానులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. సోమవారం స్థానిక రవి థియేటర్‌లో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. హీరో నాగచైతన్యకు భవిష్యత్తులో మరిన్ని హిట్స్ రావాలని, మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మదనపల్లె డివిజన్ ప్రెసిడెంట్ కే.బాబాజాన్, వైస్ ప్రెసిడెంట్ హనీఫ్, సెక్రటరీ లోకేష్, జాఫర్, సాగర్, శరత్, మహమ్మద్ సుహైల్, ఖాదర్‌బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న జిల్లా అగ్రికల్చర్ అధికారి చంద్రానాయక్

ములకలచెరువు: మండలంలోని కదిరినాధుని కోట రైతు సేవా కేంద్రాన్ని జిల్లా అగ్రికల్చర్ అధికారి బి. చంద్రానాయక్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఎరువులు, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ లోపు ప్రతి రైతు దగ్గరలోని రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పీఎం కిషాన్ పొందుతున్న లబ్ధిదారులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు పట్టా పాసు పుస్తకం, 1బి, ఆధార్ నంబరు, ఫోను నంబరు తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానికంగా ఉండే రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన వివరించారు. ఆయన వెంట ఏఓ లీలాకుమారి, సిబ్బంది, రైతులు ఉన్నారు.